కట్టెల పొయ్యే దిక్కు..!

- పెంచిన గ్యాస్ ధరలతో పేదలు బెంబేలు
- ఇప్పటికే తారాస్థాయికి నిత్యావసరాల రేట్లు
- దయనీయంగా మారిన గ్రామీణ పేదల పరిస్థితి



కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న గృహిణి



అటవీప్రాంతం నుంచి కట్టెలు తెచ్చుకుంటున్న మహిళలు

బూర్గంపాడు: పేదలందరికీ గ్యాస్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంతో చాలామంది పేదలకు గ్యాస్ కనెక్షన్లు అందాయి. అయితే ప్రస్తుతం గ్యాస్ ధరలు కొండెక్కటంతో పేదలు గ్యాస్ సిలిండర్‌ను కొనలేని పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో కొందరి ఇళ్లలో గ్యాస్ స్టవ్, సిలిండర్ ఉన్న అవి నిరుపయోగంగా మారాయి.

ఓ వైపు నిత్యావసరాలు ధరలు మండుతుండగా.. మరోవైపు గ్యాస్ ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర 1,130 రూపాయలకు పైగానే చేరింది. 2014లో రూ.410లు ఉన్నటువంటి గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు ఈ స్థాయికి చేరింది. దీనివల్ల గ్రామాల్లో గ్యాస్ కనెక్షన్ ఉన్నప్పటికీ చాలామంది మళ్లీ కట్టెల పొయ్యి మీద వంట చేసుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేలాది పేదకుటుంబాలు గ్యాస్ సిలిండర్‌లు పక్కకు పెట్టి కట్టెల పొయ్యిని వెలిగిస్తున్నారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, సారపాక, అశ్వాపురం పారిశ్రామిక ప్రాంతాల్లో పలు కార్మిక వాడల్లోని పలువురి పేదలు ఇళ్లలో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

గత ఐదేళ్లలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో పేదలకు వేలాదిగా గ్యాస్ కనెక్షన్లను అందించారు. గ్యాస్ కనెక్షన్‌ను ఉచితంగా అందించినప్పుడు ఆనందించిన పేద మహిళలు ఇప్పుడు గ్యాస్ సిలిండర్ కొనుగోలుకు మాత్రం లబోదిబోమంటున్నారు. గ్యాస్ కనెక్షన్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచుకుంటూ పోతే గ్యాస్ కనెక్షను ఉచితంగా ఇచ్చిన పెద్దగా ప్రయోజనం లేదని పేద మహిళలు వాపోతున్నారు. కొంతకాలంగా పేదలు కరెంట్ రైస్ కుక్కర్‌లు, వాటర్ హీటర్లను వినియోగించారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లులు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. అదనపు విద్యుత్ బిల్లులతో పేదలు రైస్ కుక్కర్లు, హీటర్లను పక్కనబెట్టారు. అటు పెరిగిన గ్యాస్ ధరలు, ఇటు పెరిగిన విద్యుత్ బిల్లులతో పేదలు వంటకు నానాతిప్పలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేద మహిళలు చేను, చెలకల్లో కట్టెలు తెచ్చుకుంటున్నారు. పట్టణ ప్రాంతాలలోని పేదల మాత్రం కట్టెలు దొరకక, గ్యాస్ కొనలేక వంటకు నానా తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు భారంగా మారిన గ్యాస్ ధరలను, విద్యుత్ బిల్లులను తగ్గించాలని పేదలు కోరుతున్నారు. గ్యాస్, విద్యుత్ ధరలను తగ్గించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ కొనలేకపోతున్నాం



గ్యాస్ సిలెండర్ కొనాలంటే రూ.1150 కావాల్సివస్తుంది. అన్నం, కూరలు చేసుకోవటానికి గ్యాస్ సిలిండర్ నెలన్నర రోజులు వస్తుంది. చలికాలం స్నానానికి నీళ్లు వేడి చేసుకోవాలంటే గ్యాస్ వాడితే సిలిండర్ నెలరోజులు వస్తుంది. కరెంట్‌పై హీటర్ పెట్టుకుంటే కరెంట్ బిల్లు డబుల్ ఆవుతుంది. దరలు తగ్గించాలి.

– తేజావత్ స్రవంతి, అంజనాపురం

కట్టెలు కూడా దొరకడం లేదు



గ్యాస్ ధర రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో గ్యాస్ కొనలేకపోతున్నాం. కట్టెలు కూడా దొరకటం లేదు. ఈ నెలలో ఉన్న గ్యాస్ ధర మళ్లీ నెలలో వంద రూపాయలు పెరుగుతోంది. నలుగురు ఉన్న ఇంట్లో గ్యాస్ సిలిండర్ నెల రోజులు కూడా రావటం లేదు. నెలకు రూ.1200 గ్యాస్‌కు పెడితే మిగతా సరుకులు ఎలా కొనాలి, ఎలా బతకాలి.

– పెరుమాళ్ల రమణ, మోరంపల్లిబంజర

కొండరెడ్లకు రాజశ్రీ కోళ్లు అందజేత



రాజశ్రీ కోళ్లను అందిస్తున్న సర్పంచ్‌లు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని రెడ్డిగూడెం, పాత రెడ్డిగూడెం, నడిమి రెడ్డిగూడెం, బండారు గుంపు, సుద్దగోతులగూడెం, తిరుమలకుంట కాలనీ గ్రామాలకు చెందిన కొండరెడ్ల కుటుంబాలకు ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా రాజశ్రీ కోళ్లను అందించారు. ఆయా గ్రామాల్లోగల మొత్తం 240 మంది కొండరెడ్లకు 2400 రాజశ్రీ కోళ్లను సర్పంచ్‌లు యాట్ల మహేశ్వరరెడ్డి, సున్నం సరస్వతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్థ ద్వారా ఉచితంగా అందించిన కోళ్లను పెంచుకుని ఆర్థికంగా బలపడాలని కోరారు. కోళ్ల పెంపకంతో ఆర్థిక బలోపేతం కావడంతోపాటు, ఉపాధి పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికులు ‘ఈ-శ్రమ్’ కార్డులు పొందాలి

ములకలపల్లి: కార్మిక సోదరులు ప్రభుత్వం అందిస్తున్న ‘ఈ-శ్రమ్’కార్డులను ఖచ్చితంగా కలిగి ఉండాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎండీ.యూసఫ్ సూచించారు. మండల పరిధిలోని పాతూరు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పద్దెనిమిదేళ్లు నిండి, తెల్లరేషన్‌కార్డు కలిగి, ఆధార్‌కార్డుతో మొబైల్ నంబర్ లింక్ కలిగిఉన్న కార్మికులందరికీ సంఘం ఆధ్వర్యంలో ‘ఈ-శ్రమ్’కార్డులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇందుకుగాను మారుమూల గ్రామాల్లో సైతం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు పొందినవారికి ఇన్సూరెన్స్ సౌకర్యం లభిస్తుందని, రూ.2 లక్షల వరకూ ప్రమాదబీమా లభిస్తుందని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కొందరు యువకులు ఫ్రెండ్స్ యూత్ ఫౌండేషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధుడు చేను పిచ్చయ్య మెదడులో రక్తం గడ్డ కట్టి వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో.. మల్లెలమడుగు ఫ్రెండ్స్ యూత్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.3,200 ఆర్థిక సహాయం అందజేశారు.

విద్యార్థినికి..

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ఇంటర్ చదువుతున్న విద్యార్థిని రాపర్తి అనూషకు శ్రీవిద్య విద్యాసంస్థల అధినేత నూకారపు రమేష్ ఆదివారం ఎమ్మెల్యే రేగా కాంతారావు చేతుల మీదుగా రూ.4వేలు ఆర్థిక సహాయం అందించారు. సీఎం కేసీఆర్ కప్‌లో వచ్చిన నగదు బహుమతిని చదువు కోసం ఇబ్బంది పడుతున్న అనూషకు అందించినట్లు నూకారపు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోశం నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు ముత్యం బాబు బీఆర్ఎస్ నాయకులు అక్కిరెడ్డి సంజీవరెడ్డి, కుడితిపూడి కోటేశ్వరరావు, బర్ల సురేష్, రమణ, హరిగోపాల్, రంజిత్, సురేందర్‌పటేల్, సాయిచరణ్‌లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

చర్ల: కార్పొరేట్ వైద్యశాలలు సంపాదనే ధ్యేయంగా కాకుండా ప్రజల ఆరోగ్యంపై కూడా మరింతగా దృష్టి సారించాలని చర్ల తహసీల్దార్ బి.భరణిబాబు సూచించారు. భద్రాచలంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం చర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో శిబిరాన్ని ఏర్పాటు చేసిన కిమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. శిబిరంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కిమ్స్ హాస్పటల్ వైద్యులు సురేందర్, మహమ్మద్ ఫరీద్, యుధిష్టర్, ప్రసాద్, అలీనాశాంతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసిన భూములకు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి కల్పన

చర్ల: అటవీశాఖాధికారులు జీపీఎస్ ద్వారా సర్వే చేసిన పోడు భూములన్నింటికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సత్యానారాయణపురంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భద్రాచలం డివిజన్‌లో వేలాది మంది గిరిజనులు, దళితులు, నిరుపేదలు పోడు కొట్టి వ్యవసాయం చేసుకుంట జీవనాన్ని సాగిస్తున్నారని, అటువంటి వారందరికీ ఇటీవల జరిపిన సర్వే ప్రకారం వెంటనే పట్టాలివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని, దళితబంధు పథకంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలను ఆపాలని అర్హులైన ప్రతి దళిత కుటుంబానికీ దళితబంధు పథకం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరో మారు విద్యుత్ చార్జీలను ప్రభుత్వం పెంచాలని చూస్తోందని ఆ ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె కోరారు. సమావేశంలో నాయకులు లంకా వెంకట్ ఇందుకూరి సత్తిబాబు, స్వామి, సమ్మయ్య, త్రిమూర్తులు. లక్ష్మయ్య, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

దమ్మపేట: మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగగా, తీవ్రగాయలైన సంఘటన మండల పరిధిలోని చిల్లగుంపు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి చిల్లగుంపు గ్రామానికి చెందిన గజ్జల పాల్, గజ్జల అప్పన్నలతో అదే గ్రామానికి చెందిన మరో వర్గం వ్యక్తులకు మధ్య మద్యం సేవించిన మత్తులో మాట మాటా పెరిగింది. అది తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. ఈ క్రమంలో గజ్జల పాల్, గజ్జల అప్పన్నలపై మరో వర్గం వ్యక్తులు ఆయుధాలతో దాడి చేశారు. దాడి చేసిన వారిలో అదే గ్రామానికి చెందిన నక్కా శ్రీను, నక్కా ప్రదీప్, నక్కా వీరబాబు, నక్కా అజయ్‌లు ఉన్నారు. దాడిలో గజ్జల పాల్, గజ్జల అప్పన్నలకు తీవ్ర గాయాలు కాగా, దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పాదయాత్రతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

పినపాక: ఫిబ్రవరి 6 నుంచి కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి భద్రాచలం నుంచి పాదయాత్ర చేయడం సంతోషకరమని, ఈ పాదయాత్రతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని పార్టీ నియోజకవర్గ మహిళా నాయకురాలు శ్రీవాణి అన్నారు. ఆదివారం బయ్యారం క్రాస్ రోడ్ లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడుతుందన్నారు. ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య వెంకటేశ్వర రెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి, తదితరుల పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సుదర్శన్‌రావును మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి సేవలకు గాను సుదర్శన్‌రావు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపి శాలువలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయభారతి, పాకాల దుర్గాప్రసాద్, సుధాకర్, గంగాధర్, శ్రీనివాస్, శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దమ్మపేట: మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామ యాదవ సంఘం కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామంలో యాదవ సంఘం మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో వడ్లగూడెం గ్రామ యాదవ సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నరదాల వీరస్వామి, నూనె నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. మండల కమిటీ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, నూనె శ్రీనివాసరావు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, జోనెబోయిన శ్రీనివాసరావు, సాయిల నరసింహారావు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



మణుగూరురూరల్: బహుమతులను ప్రదానం చేస్తున్న విప్ రేగా కాంతారావు దంపతులు

మణుగూరుటౌన్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్‌కప్–2023 క్రీడా పోటీల్లో విజేతలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదిరోజులుగా నిర్వహించిన క్రీడా సంబురాల్లో పాల్గొన్న నియోజకవర్గంలోని క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు వాలీబాల్ కిట్ అందించారు. అదే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ విద్యారంగ సంస్థల అన్నింటికీ ఒక వాలీబాల్ కిట్ అందజేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైద్య సౌకర్యాలతోపాటు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి ఉద్యోగాల్లో స్పోర్ట్సుకోటాకు పంపుతోందని అన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి రేగా కాంతారావు, ఆయన సతీమణి సుధారాణిలు బహుమతులు అందజేశారు. ముగింపు వేడుకల్లో నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్ఎస్ మండల పార్టీ నేతలు ముత్యంబాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆపద్బాంధవుడు రేగా..’

గుండాల: పేద ప్రజలకు ఎలాంటి సమయంలోనైనా నేనున్నాంటూ ధైర్యాన్నిస్తూ అత్యవసర సమయంలో ఆదుకోవడంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆపద్బాంధవుడిలా ముందున్నాడని బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు సయ్యద్ అజ్జు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత కొంత కాలంగా హైదరాబాద్ ఆస్పత్రిలో గుండాల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన దుగ్గి సుధాకర్ స్పృహ కోల్పోయి వైద్యం పొందుతున్నాడని తెలిపారు. కాగా మెదడులో రక్తం గడ్డకట్టిందని ఆపరేషన్ చేయించడానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. బాధిత కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిపై ఎమ్మెల్యే రేగా కాంతారావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2లక్షల 50వేలు మంజూరి చేయించి, చెక్కును కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపడుతూ పేద ప్రజలకు అండగా నిలబడుతున్నాడని గుర్తు చేశారు.

లీకవుతున్న భగీరథ పైప్‌లైన్



పెంట్లం గ్రామంలో లీక్ అవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామంలోని మిషన్ భగీరథ పైపుకు రంధ్రం పడి నీరు వృథాగా పోతోంది. లీకైన పైపు నుంచి నీరు, చిన్న కాలువను తలపించేలా ప్రవహిస్తోంది. పైపు లైన్‌కు మరమ్మతులు చేసినప్పటికీ నీరు లీక్ అవ్వడం ఆగలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే పైపులైన్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహించి, నీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన రూ.26 వేలు, మిట్టగూడెం గ్రామానికి చెందిన సువర్ణకుమారికి రూ.26,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గజ్జల లక్ష్మారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, షేక్ నయీం, రాందాస్, సత్యనారాయణ, నజీర్‌షోను, దాసు, మందా హుస్సేన్, ఇనంపల్లి పున్నారావు, వంశి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసుల ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. తనిఖీలలో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, కలివేరు క్రాస్ రోడ్ తదితర ప్రాంతాలలో మోహరించిన పోలీసు బలగాలు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురిని దుపులోకి తీసుకుని విచారణ అనంతరం వారిని విడిచిపెట్టారు.

ముందస్తు అరెస్ట్

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఏజెన్సీ గిరిజన ఉపాధ్యాయ సంఘాలు ఈ నెల 22న ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం డివిజన్‌లోని గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులును పట్టణ పోలీసులు ఆదివారం తెల్లవారు జామున అరెస్టు చేసి అనంతరం వారి పుచికత్తుపై విడుదల చేశారు.

30న ‘చలో హైదరాబాద్’



చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దుమ్ముగూడెం: కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రగతిశీల కేజీబీవీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోనెల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం దుమ్ముగూడెంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీలలో సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేయాల్సి వస్తోందని, సిబ్బందితో అధికారులు వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. ఇలా చేసినప్పటికీ చాలీచాలని జీతాలే దిక్కుతున్నాయని అన్నారు. గత ఏడాది జూన్ నెలలో నియమించిన వారికి డిశంబర్ నాటికి 6 నెలల వేతనం రావాల్సి ఉండగా కేవలం ఒక్క నెల వేతనం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వేల్పుల రమేష్, కేజీబీవీ సిబ్బంది రమాదేవి, సత్యవతి, లక్ష్మి, అనూష, వెంకటమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కుక్కల సమస్యను పరిష్కరించరూ..!



భద్రాచలం పట్టణంలో కుక్కల సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కాలనీల్లో గుంపులు గుంపులుగా విచ్చలవిడిగా తిరుగుతూ.. ఒంటరిగా ఉండే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఈ మధ్య కాలంలో కుక్కల సంచారం పలు కాలనీలలో ఎక్కువైంది. ఈ సమస్యపై కాలనీల వాసులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల సమస్య నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

- భద్రాచలంటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ
ఫోన్ నంబర్: 95050 13090

క్లుప్తంగా

రాజ్యాంగ విశిష్టతను తెలుసుకోవాలి

భద్రాచలంటౌన్: విద్యార్థులు భారత రాజ్యాంగ విశిష్టతను గురించి తెలుసుకోవాలని భద్రాచలం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన గురుకుల బాలికలకు భారత రాజ్యాంగం అమలు తీరుపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేవదాసు, రిటైర్డ్ ఎంఈఓ బాబు, రంగయ్య, అల్లాడ వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, ఈశ్వరయ్య, సాయి నాగరాజు, స్వాతి పాల్గొన్నారు.

బల్బుల వితరణ

భద్రాచలంటౌన్: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయానికి విద్యుత్ బల్బులను శ్రీరామ్ వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు ఆదివారం వితరణగా అందజేశారు. వాసవి క్లబ్ భద్రాచలం నూతన కార్యవర్గం ఏర్పాటు, శ్రీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవమును పురస్కరించుకుని తొలి సేవా కార్యక్రమంగా రూ.5వేలు విలువ చేసే విద్యుత్ బల్బులను అందజేసిన్నట్లు నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్, కంభంపాటి సురేష్‌కుమార్, వాసవి క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు రేపాక శ్రీనివాస్, నాళ్ళ సాయిచందు, సునీల్, కృష్ణయ్య, వెంకట నాగభూషణం, రగేష్‌కుమార్, రాంబాబు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల మొద్దులమడ గ్రామంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 31 మందికి వైద్య పరీక్షలు చేసి, ముగ్గురు జ్వరపీడితులను గుర్తించి వైద్య సేవలు అందించారు. హెచ్‌ఈఓ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కోర్డినేటర్ అలవాల రాజా పెరియార్ అన్నారు. పట్టణంలోని జగదీష్ కాలనీలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వెంకటేశ్వర్లు, రాంబాబు, ప్రభాకర్, సత్యనారాయణ, సత్తిబాబు, వీర్రాజు, లత, సూర్య, వాణి, సమ్మక్క, రమాదేవి, హేమలత, జయమ్మ పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని రేగుబల్లిలో గ్రామం మధ్యలో ఉన్న ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను రవాణా చేస్తున్న సందర్భంలో ద్విచక్రవాహనదారులు, సైకిలిస్టులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దళిత హిందూ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు ఆరోపించారు. ఆదివారం మండలంలోని రేగుబల్లిలో సంఘం సీనియర్ నాయకులు లకమల్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి రవాణాతో గ్రామంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామం మధ్యలో ఉన్న ఇసుక క్వారీని తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎం.కాంతయ్య, కనకరావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. కూకట్‌పల్లికు చెందిన యలమంచి జగదాంబ, సాంబమూర్తి దంపతులు లక్ష రూపాయలను ఆలయ అధికారులకు అందజేయగా వారు దాతలకు రశీదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రామిరెడ్డి, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాలే నివాళి

భద్రాచలంటౌన్: మహిళా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించడమే బండారు శ్రీదేవికి అందించే ఘన నివాళి అని ఐద్వా జిల్లా ఉపాధ్యాక్షురాలు నాదెళ్ల లీలావతి అన్నారు. ఐద్వా, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం బండారు శ్రీదేవి 5వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సీతాలక్ష్మి, జ్యోతి, గంగ, సక్కుబాయి, ఎంబి.నర్సారెడ్డి, స్వామి, శరత్, రాజేశ్వరి, బుజ్జమ్మ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మణుగూరురూరల్: మండలంలోని పగిడేరు గ్రామపంచాయితీలో ఇద్దరు వార్డుమెంబర్లతో పాటు సుమారు 50 కుటుంబాల వారు వివిధ పార్టీలను వీడి ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, పట్టణ కార్యదర్శి బొలిశెట్టి నవీన్, సొసైటీ డైరెక్టర్ పప్పుల ప్రసాద్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మట్టపల్లి సాగర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు గువ్వా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.